# ★ భోజనంవద్ద మొగమాటం ★

• శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ •

భారత స్త్రీల గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింప జేసిన వాటిల్లో అతిథిసత్కారం ఒకటి. మన పురాణేతిహాసాల్లోని ఆతిథ్యగాథలు చూస్తే వీనిఖ్యాతి విదితమవుతుంది అనసూయ త్రిమూర్తులకు పెట్టిన భోజనమూ, ద్రౌపది శిష్య సహితుడగు దూర్వాసమహర్షికి చేసిన విందూ సుప్రసిద్ధాలు ఆతిథ్యమంటే ఇంటికి వచ్చిన బంధుమిత్రాదులకుగాని తదితర పెద్ద మనుష్యులకు గాని గౌరవ పురస్సరంగా భోజనం పెట్టడం అని చెప్పాలె. తనయింటికి భోజనమునకు వచ్చినవారిని ఇష్ట మృష్టాన్నములతో సంతృప్తి నొందించడమే ఆతిథ్యమనిపించుకుంటుంది అతిథి కేది ఇష్టమో అది కడుపు బెట్టినప్పుడే ఆ అతిథి సత్కారం సఫలమవుతుంది పసిపాపలైన త్రిమూర్తులకు భక్ష్య భోజ్యాదులతో విందు చేస్తే వాళ్ళేమి ఆరగిస్తారు? చిన్న మృణ్మయపాత్రతో వేడి వేడి బువ్వ మెత్తగా [illegible]గూడులాగా వండి వామూ ఉప్పూ, పప్పూ పాతచింతకాయ పచ్చడో వేసి కమ్మని ఆవు నెయ్యి వేసి గుజ్జుగా కలిపి ఆం తినమంటూ లాలిస్తూ తినిపిస్తేనే త్రిమూర్తులకు సరైన భోజనం పెట్టినదవుతుంది. అనసూయాదేవి నిజంగా సతీ అనసూయ బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు అటువంటి భోజనము పెట్టి ఉండాలె లేకపోతే వారు అంతగా ఆమె ఎడ ప్రసన్నులై ఉండరు.

పాండవులు అరణ్యవాసం చేస్తున్నరోజుల్లో కొద్దిగా పదివేలమంది శిష్యులతో దూర్వాసుడు ద్రౌపదికి అతిథిగా వచ్చాడు దూర్వాసుడంటే ఎవరో మనందరికీ తెలుసు నాటినుండి నేటిదాకా లోకంలోని కోపధారులందరికీ నిజనామమునే బిరుదుగా ప్రసాదించిన ధూర్త మహర్షి అతడు. ఆ కోపోజ్వల దివ్యమూర్తి అతిథిగా వచ్చాడని వినగా శ్రీకృష్ణభగవానుడు ద్రౌపది ఒసంగిన ఏబలుసాకు పులుసు కూరో నలుసంత మెసవి షడ్రసోపేతమైన భోజనం చేసినట్లుగా సంతృప్తి చెంది శిష్యసహితుడగు దూర్వాసమహర్షికి ఆతిథ్యమియ్యగల మహనీయశక్తి ద్రౌపదికి ప్రసాదించాడు కనుక గాని లేకపోతే మొగమాట మెరుగని దూర్వాసుని శాపానికి ద్రౌపది ఇంధనం కావలసివచ్చేది అటువంటి విషమ పరిస్థితులనుండి ద్రౌపదిని రక్షించాడు శ్రీకృష్ణుడు.

ఆనాడే గాదు యీనాడు ఇటువంటి విషమపరిస్థితులు ప్రతిగృహిణికీ ఎదుర్కొంటూనే ఉంటాయి ఇటువంటి పరిస్థితులను సమర్థించుకొన్న గృహిణే ఉత్తమ ఇల్లాలు నిజానికి దేవుడికైనా మానవుడికైనా వారికిష్టమైనది వారికి ఆరగింప చేసినప్పుడే వారు సంతృప్తి చెందుతారు. చూడండి విఘ్నేశ్వరుడున్నాడనుకోండి! ఆయనకు ఉండ్రాళ్లంటే మహా ఇష్టం ఇరవైయొక్క రకాల పత్రితో పూజించి ఇరవై ఒక్క ఉండ్రాళ్ళు నివేదన చేస్తేనే ఆయన సంతృప్తి చెందుతాడు ఎబ్బే! గుండ్రాళ్లలాగా యీ ఉండ్రాళ్లు నైవేద్యం పెట్టటమేమిటని ఇంతకూర పూరీ ఇంట్లో తయారు చేసో హోటలునుండి తెప్పించో నివేదన చేస్తామంటే వల్లగాదు. విఘ్నేశ్వరుడు ఉగ్రుడై మనం తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరకుండా చేస్తాడు

చూశారా! ఇతరులకు భోజనం పెట్టడంలో ఎన్నో చిక్కులున్నాయి భోజనం విషయంలో కొందరికి విధి నిషేధాలుంటాయి కొందరికి భిడియమూ మొగమాటమూ ఉంటుంది నిజంగా ఇంటికి వచ్చిన బందుమిత్రాదులకు అన్ని మర్యాదలూ చేయడం ఒక యెత్తూ, భోజనం పెట్టడం ఒక ఎత్తూను. ఈ భోజనం విషయంలో తృప్తి పొందించడంలోనే ఉన్నది గృహిణి చాకచక్యమంతా. అన్ని వస్తువులు సమృద్ధిగా ఉండి వంటచేయడానికీ, ఇతర పనులు చేయడానికీ, నౌకరులున్న గృహిణికి ఒకరికి భోజన భాజనాదులు అమర్చడంలో అంత కష్టం లేదు కేవలం దరిద్రులయింటికి బంధువులు రావడమూ వారికి విశేష మర్యాదలు చేయడమూ అంతగా ఉండదు. ఇక కష్టమంతా మధ్యరకం కుటుంబానిదే సహాయం చేయడానికి పనివాళ్ళు ఉండరు. ఇంట్లో వస్తువులు సమృద్ధిగా ఉండవు. వచ్చిన బంధువుకో, మిత్రునికో తుష్టిగా భోజనం పెట్టాలె. అట్లా పెట్టకపోతే కుటుంబగౌరవానికే లోపం గృహిణిత్వ ధర్మానికే లోపం. కనుక ఆ వచ్చిన పెద్ద మనిషికి లక్షణమైన భోజనం పెట్టడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది గృహిణి యీభోజనం

పెట్టడంలో ఆ వచ్చిన పెద్దమనిషి ఉభయులకు ఇష్టుడూ కావలసినవాడూ అయితే అట్టే పేచీలేదు వ్యవహారం సమరసంగానే జరుగుతుంది అట్లాకాకుండా కేవలం భార్యకు మాత్రమే అయినవాడైతే ఇంటికి వస్తువులు రావు భర్తకు మాత్రమే ఇష్టుడైతే ఇంటి ఆమె తలకు వాశెనకట్టుతుంది కనుక భార్యాభర్తలిరువురు సమరసభావంతో పెట్టే భోజనమే సొంపైనదీ ఇష్టైందీను. ఇంతవఱకు భోజనం పెట్టే వారి సంగతి ఆలోచించాము. ఇక భోజనం చేసే వారి సంగతి ఆలోచిద్దాం

ఆహారం పట్లా వ్యవహారం పట్లా మొగమాటం పనికి రాదని సామెత ఉన్నా సాధారణంగా పరాయి యింటి భోజనం చేసే సందర్భంలో చాలామంది మొగమాటమే పడతారు వడ్డించిన వస్తువులన్నీ తింటేనూ ఇష్టమైన వస్తువు మళ్లీ వేయించుకుంటేనూ ఎవరేమనుకుంటారో అనే కొందరికి సంకోచంగా ఉంటుంది కనుక ఇష్టం వున్న వస్తువూ అవసరమైన వస్తువూ కూడా వేయించుకోకుండా వద్దు వద్దని చేయి అడ్డం పెడుతారు ఈ సందర్భంలో వారు కలుపుకున్న వస్తువును ఒక కంట కనిపెట్టి వద్దన్న కొద్దీ వడ్డించే ఇల్లాలైతే యీ మొగమాటస్తులకు కడుపు నిండుతుంది. అట్లా వడ్డించకుండా వెనుక తీస్తే వారు అర్ధాకలితో లేవడమే తటస్థిస్తుంది ఈ మొగమాటస్తులు పంక్తిని కూర్చుంటే బాగా భోజనం చేసేవాళ్లకీ చిక్కే ప్రక్కన కూర్చున్నవాళ్ళు అన్నీ వద్దువద్దని అంటూ ఉంటే తాము కావాలని వడ్డించుకుంటే వీళ్లేదో కరువును పడివచ్చినట్టున్నారని ఎక్కడ అనుకొని పోతారో అని పంక్తిలో ఉన్నవాళ్లందరికీ భయమే అందువల్ల తక్కినవాళ్ళుకూడా సగం తిండే తినడం సంభవిస్తుంది ఒకనాడు ఒక గొప్ప యింటి అమ్మాయిలు ఒక చోటికి భోజనానికి వచ్చారు వారి తిండే అంతేనో, లేక ఇంటివద్ద కొంత భోజనం చేసే వచ్చారో, కాక మొగమాటమో, మరల తెచ్చిన వస్తువులు వడ్డించుకోకపోగా మొదట విస్తరిలో వడ్డించినవే పూర్తిగా తినకుండా కోళ్లు కెక్కిరించినట్టు కెక్కిరించి గర్వాంత నంజినట్టే నంజి కూర్చున్నారు. ప్రక్కనున్న వాళ్ళకు ఏది తినడానికీ, ఏ వస్తువు వేయించుకోడానికీ తిండిపోతులని ఎక్కడ అనిపోతారో అని చచ్చే భయమైపోయింది వాళ్ళ అవస్థ చూచి ఆ యింటి ఇల్లాలు వాళ్ళు నాజూకు మంతులఁరా వాళ్ళనుచూచి మీరు బిడియపడకండని కొసరి కొసరి మారు వడ్డించి తక్కినవాళ్ళకు సుష్టుగా భోజనం పెట్టింది విందుభోజనాల్లో ఇట్టువంటి తమాషాలెన్నో జరుగుతుంటాయి కొంతమంది ఎవరిఇల్లైనాసరే, స్వగృహమే అనుకొని ఎంతో ధారాళంగా తమకు కావలసిన పదార్థాలు చెప్పి వేయించుకొని లక్షణంగా భోజనం చేస్తారు అటువంటివారితో ఏలాంటి ఇబ్బందిలేదు. వెనుకటికి ఒకాయన ఉండేవాడు ఆయనకు మొగమాటమనేది కలికానికైనా ఉండేదికాదు ఆయనవూరినుంచి వస్తూనే సరాసరి వంట యింట్లోకివెళ్ళి ఇంటి ఇల్లాలిని కుశలప్రశ్నగా ఆమాటా యీమాటా అడిగి ఇదిగో అమ్మాయి ఇవ్వాళ కూరేమిటనేవాడు. ఆమె బంగాళాదుంపలంటే చక్రాలు తరిగి వేయించమనో, వంకాయలైతే గుత్తికాయ చేయమనో, ఆకుకూరైతే పప్పో పడియాలో వేసి చేయమనో పురమాయిస్తూ, అమ్మాయి, నూనె తగిలితే నాకు దగ్గువస్తుందిగాని నేతి పోపులే పెట్టమ్మా అనేవాడు బావగారు భోజనానికి వచ్చేటప్పటికి ఏవేళవుతుందో కాస్త పాలు ఎక్కువ వేసి డికాక్షన్ తక్కువవేసి ఒక కప్పు కాఫీ తీసుకరా అమ్మా అనేవాడు. రాత్రుళ్లు మజ్జిగ పోసుకోను, ఒక పావుశేరు పాలు పోయించుకొని ఉంచమనేవాడు ఇంక శనివారం రాత్రి భోజనం చేయను అనేవాడు అంటే రాత్రికి ఏ ఫలహారమో చేయమన్నమాట. ఇంట్లో అన్ని వస్తువులు ఉన్న యిల్లయితే ఇటువంటివారితో ఏమీ కష్టం లేదు. కావలసినవి అడిగి లక్షణంగా పుచ్చుకుంటారు. ఇది వారికీ సుఖమే ఇల్లాలికీ సుఖమే. ఇక ఇల్లాలికి వచ్చే చిక్కు అల్లుడితో ఆ అల్లుడైనా పాతవాడైతే పరవాలేదు. అమ్మాయి అతని రుచులన్నీ అవగతం చేసుకొని అమ్మా బంగాళదుంపల ముద్దకూర ఆయన అసలే ముట్టుకోరు, ప్రతిపూట అప్పడం వడియం ఉంటేనే కా[illegible]రు ముద్ద యెత్తరు వట్టి పప్పులో ఊరు మిరపకాయలు నొరుక్కోవడమంటే వారికెంతో ఇష్టం, చెన్నపట్నం చదువుకు వెళ్లినప్పటినుంచీ పెరుగు పచ్చళ్లూ మజ్జిగపులుసులూ వారికి బాగా అలవాటైనాయంటూ వివిధ విధాలుగా తన భర్తకిష్టమైన పదార్థాలుతల్లికి తెలియజెప్పి, ఇష్టమైన వంట

కములు తయారు చేయించి, భర్తకు భోజనం పెట్టిస్తుంది కొమార్తె కనుక పాత అల్లుడితో అట్టే కష్టం లేదు అత్తగారికి కలిగే ఇబ్బంది అంతా క్రొత్త అల్లుడితోనే. అసలు అత్తగారికి కొత్త అల్లుడంటే మహా ముచ్చట అందువల్లనే "అల్లుడికి చేసిన సంభారమంతా కొడుకుకు పెట్టి కోలుపోయినా"నన్న సామెత పుట్టింది. అవును అల్లుడు వచ్చాడని ఒకటికి నాలుగు ఆధరువులు చేసి ఉంటుంది ఆ విధంగా రోజూ ఇంట్లో ఉండే కొడుక్కు పెడితే కొంపదివాలేకదూ అందుకే ఆసామెత వచ్చింది.

కొత్తగా వచ్చిన అల్లుడికి ఏవి ఇష్టమో అత్తగారికి తెలియదు అయితే ఆయన కిష్టమైనవే చేసి పెట్టవలెనని ఆమె అభిలాష కనుక ఒక దుంపకూర వేయించి, ఒక కాయ.గూర తిరగమోత వేసి, ఒక తియ్యపచ్చడి పుల్ల పచ్చడి చేసి, పప్పు పులుసూ చారూ చేసి అప్పడం వడియం ఊరుమిరపకాయలు వేయించి' ఒక కారపు పిండివంట ఒక తీపి పిండివంట చేసి పుల్ల పెరుగు పోగిచి తియ్యపెరుగుతోడుబెట్టి అటుక మీది ఊరగాయలుగూడ తీసి విస్తరినిండా వడ్డిస్తుంది. అయితే అత్తవారింట్లో భోజనం చేసే పద్ధతులు వివాహానికి పూర్వంనుంచి ఎన్నాళ్ళుగా ఊహించి మనసులో పెట్టుకొని ఉంటాడో కాని, కొత్తగా పెండ్లైన ఆ పెండ్లి కొమారుని మొగమాటానికి అంతు ఉండదు. ఇంటివద్ద వెల్లుల్లికారం తినేబాపతైనా సరే, అత్తవారింట భోజనం అనగానే వడ్డించిన వస్తువులు మరల వడ్డించుకోను విస్తరిలో మొదట వడ్డించినవైనా కొన్ని రుచి చూచీ కొన్ని చూడకా, కొన్ని కలుపుకొని కొన్ని కలుపుకోక, కొన్నిటిని తినీ, కొన్ని తినకా కాస్తో కూస్తో అట్లా ఇట్లా నంజి అటూ ఇటూ తోసి పది నిముషాల్లో భోజనం ముగించి అత్తగారు దిక్కు మొగం వేసి చూస్తూ ఉండగా లేచిపోతాడు అదీ ఒక నాజూకు గానే భావించి అత్తగారు మనస్సమాధానం చేసుకుంటుంది మా ఊళ్ళో ఒక తాతగారు ఉండేవారు వాళ్ళ ఇంటికి ఒకనాడు మనుమరాలి పెనిమిటిని మనుగుడుపులకు తీసుకొని వచ్చారుట అతనికి, అయిదారు బజ్జీలు రెండు జాంఘీరులు ఫలహారం పెట్టారుట అతను ఒక్క జాంఘీరులో కొంచెము, మూడు బజ్జీలు మాత్రమే తిని అరకప్పు కాఫీ మాత్రం త్రాగి లేచిపోయినాడట ఆ ముసలాయనకా షోకు చూస్తే ఒళ్ళు మండి 'ఏమబ్బాయి ఇవేమన్నా మా కాలంలో లాగ అరిశెలా, జంతికలా, చేగోడిలా, మినపసున్ని ఉండలా, ఇరవైయేళ్ల పడుచుకుర్రవాడివి ఆరు బజ్జీలు, రెండు జిలేబీ చుట్టలూ తినలేవుటోయి' అని అన్నాడుట ఆ అబ్బాయి ముసిముసి నవ్వులు నవ్వుతూ నాకు సయించవండీ తాత గారూ అన్నాడుట

ఇక అధికార్లకు పెట్టే భోజనాలు వారి మొగమాటాలూ మరోవిధంగా ఉంటాయి అది సమృద్ధిగా వస్తువులుదొరకని పల్లెటూరైతే ఆ ఇల్లాలి ఇబ్బందులు అనంతము ఆ అధికారి, తానూ, తనగుమాస్తాలు తన బంట్రోతులూ భోజనాలు చేయడమే కాకుండా తనతో పనిఉండివచ్చిన ఇతర పెద్దలనుగూడా 'పొరుగింట చూపరా నా పెద్ద చెయ్యి' అన్నట్టు భోజనానికి లేవమంటాడు. అందరూ షడ్రసోపేతంగా భోజనం పెట్టవలసినవాళ్ళే కాదంటానికి గృహ యజమానికి మొగమాటం. చేసిపెట్టలేక ఇల్లాలికి కష్టం ఇదే విషమ పరిస్థితి తీగ లాగుతే డొంకంతా కదులుతుంది. ఇప్పటికే ప్రసంగం ప్రస్తుతానికి మించింది సెలవు

(రేడియో ప్రసంగం)